ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వేర్వేరు ఘటనల్లో ఐదుగురు ఆత్మహత్య చేసుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతూ ఒకరు, తాగిన మైకంలో ఇద్దరు, రామాయంపేట మండలంలో వేర్వేరుచోట్ల ఇద్దరు వృద్ధులు బలవన్మరణం పొందారు. ఇందులో కొందరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు.

● కేన్సర్ వ్యాధిగ్రస్తుడు

మనోహరాబాద్, అక్టోబర్ 7: కేన్సర్ వ్యాధిగ్రస్తుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన తూం నాగయ్య (60) రెండు సంవత్సరాల నుంచి కేన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. దీంతో జీవితంపై విరక్తి చెందిన అతడు గత శుక్రవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. గమనించిన భార్య వెంటనే నాగయ్యను కిందికి దింపి తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి ఆర్‌వీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మరణించారు. కోడుకు మల్లేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

● మద్యం మత్తులో యువకుడు..

బెజ్జంకి, అక్టోబరు 7 : మద్యం మత్తులో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని దాచారం గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన బొర్ర రాకేష్(20) వృత్తిరీత్యా చేపలు పట్టుకుంటూ తల్లిదండ్రులతో కలిసి జీవిస్తున్నాడు. ఆదివారం రాత్రి రాకేష్ ఇంట్లో భోజనం చేసి తన గదిలోకి వెళ్లాడు. కొద్దిసేపటికి అతడి సోదరుడు రూమ్‌లోకి వెళ్లి చూడగా రాకేష్ వెంటిలేటర్‌కు చీరతో ఉరివేసుకుని కనిపించాడు. దీంతో వెంటనే అతడిని కిందికి దింపి చికిత్సకు తరలించేందుకు 108 రప్పించారు. సిబ్బంది పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి బొర్ర రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపారు.


రాకేష్ (ఫైల్)

● వేర్వేరు చోట్ల ఇద్దరు వృద్ధులు..

రామాయంపేట, అక్టోబరు 7 : వేర్వేరు ఘటనల్లో ఇరువురు వృద్ధులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. వివరాల్లోకి వెళ్తే లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన కాసుల నాగవ్వ (58) ఆదివారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లి తిరిగిరాలేదు. సోమవారం కుటుంబీకులు పలుచోట్ల వెతకగా ఊరికి సమీపంలోని ఓ వ్యవసాయ పాడుబడ్డ బావిలో మృతదేహం లభ్యమైంది. అలాగే పట్టణానికి చెందిన పుట్టి పెద్దస్వామి(70) ఇంట్లో నుంచి వెళ్లిన రెండు రోజుల తర్వాత స్థానికంగా కొత్తచెరువులో శవం లభ్యమైంది. ఈ మేరకు పోలీసులు ఇరువురి మృతదేహాలను స్థానిక ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. ఈ మేరకు కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బాలరాజ్ తెలిపారు.

● పురుగుల మందు తాగిన వ్యక్తి..

పాపన్నపేట, అక్టోబరు 7 : మద్యం మత్తులో పురుగు మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన సోమవారం మండల పరిధిలోని కొడుపాకలో చోటు చేసుకుంది. పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం మేరకు గ్రామానికి చెందిన బునెల్లి విఠల్(66) కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. తరచుగా కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో ఆదివారం మద్యం తాగి వచ్చి కుటుంబీకులతో గొడవ పడగా, మద్యం మానాలని హితవు పలికారు. దీంతో మనస్తాపానికి గురైన విఠల్ అర్ధరాత్రి పురుగుమందు తాగాడు. ఇది గమనించిన కుటుంబీకులు వెంటనే అతడిని మెదక్ ఏరియా ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి సోమవారం ఉదయం మరణించాడు. కొడుకు శ్రీశైలం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు. ఆయనకు భార్య సాయమ్మ, ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు.


విఠల్(ఫైల్)

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

మనోహరాబాద్, అక్టోబర్ 7: వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన ఘటన మండల పరిధిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం మనోహరాబాద్ మండల కేంద్రానికి చెందిన మెడోజి సంతోష్(36) ఆదివారం స్నేహితుడి పుట్టినరోజు వేడుకకు దండుపల్లికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఆ గ్రామం వద్ద 44వ జాతీయ రహదారిని దాటుతుండగా హైదారాబాద్ నుంచి తూప్రాన్ వెళ్తున్న గుర్తుతెలియని వాహనం బలంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


సంతోష్ (ఫైల్)

ద్విచక్ర వాహనం అదుపు తప్పి..

పాపన్నపేట, అక్టోబరు 7: ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని మల్లంపేట గ్రామ శివారులో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం ప్రకారం కొత్త లింగాయిపల్లి గ్రామానికి చెందిన కోలుకురి సాయిలు (48) మండల కేంద్రమైన పాపన్నపేట నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. మల్లంపేట గ్రామ శివారులోని సంగయ్య గుండ్ల వద్దకు రాగానే వాహనం అదుపు తప్పి కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

మాకూ న్యాయం చేయండి

● డీఎస్సీ-2008 ఎస్‌జీటీ అభ్యర్థులు


స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న అభ్యర్థులు

సిద్దిపేట కల్చరల్, అక్టోబర్ 7 : డీఎస్సీ టీచర్ సెలక్షన్ రూల్ 15ను అమలు చేసి తమకూ న్యాయం చేయాలని ఉమ్మడి జిల్లాకు చెందిన డీఎస్సీ- 2008 ఎస్‌జీటీ అభ్యర్థులు కోరారు. ఈ మేరకు సోమవారం స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నర్సింహారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీఎస్సీ-2008 ఎస్‌జీటీ సెలక్షన్ లిస్టు తప్పులతడకగా ఉందని ఆరోపించారు. 2008లో డీఎస్సీ రాసి 70:30 రిజర్వేషన్ వల్ల ప్రభావితమైన అభ్యర్థులకు కాంట్రాక్ట్ పద్ధతిలో అవకాశం కల్పిస్తూ ధ్రువపత్రాల పరిశీలన చేపట్టారన్నారు. అయితే ఈ ప్రక్రియలో కొన్ని లోపాలున్నాయని, డీఎస్సీ టీచర్ సెలక్షన్ రూల్ 15ను ఇంప్లిమెంట్ చేయడం లేదని ఆరోపించారు. ఒకే అభ్యర్థి స్కూలు అసిస్టెంట్, ఎస్‌జీటీ పోస్టులకు సెలక్ట్ అయితే అతడిని స్కూలు అసిస్టెంట్ పోస్టుకు ఎంపిక చేసి, ఎస్‌జీటి పోస్టును తర్వాత మెరిట్ అభ్యర్థికి ఇవ్వాలన్నారు. 2008వ సంవత్సరం డిసెంబర్ 6న విడుదల చేసిన సర్వీస్ రూల్ కూడా ఇదే చెబుతుందని గుర్తుచేశారు. ఇలా రెండు సబ్జెక్ట్‌లకు సెలక్ట్ అయినవారు 40మంది ఉన్నారని, వాటికి తర్వాత మెరిట్ అభ్యర్థులను ఎంపిక చేసి న్యాయం చేయాలని కోరారు. అంతేకాకుండా 292 పోస్టులకు 183 మంది మాత్రమే సర్టిఫికేట్ వెరిఫికేషన్‌కు హాజరయ్యారని, ఇంకా 119 పోస్టులు ఉన్నాయన్నారు. ఈ విషయాన్ని జిల్లా విద్యాధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా స్పందించడం లేదని వాపోయారు.

చిన్నారి పుట్టిన రోజున ఆర్థిక సాయం


చెక్కు అందజేస్తున్న జ్ఞానేశ్వర్

నారాయణఖేడ్, అక్టోబరు 7: నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని మంగల్‌పేటకు చెందిన పసుల శ్రీనివాస్ ఇల్లు ఇటీవల భారీ వర్షాలకు కూలిపోగా నిరాశ్రయుడయ్యాడు. ఈ క్రమంలో మంగల్‌పేటకు చెందిన ఆర్ఎస్ఎస్ బాధ్యుడు మేకల జ్ఞానేశ్వర్ తన కుమార్తె హైందవి ప్రియదర్శిని పుట్టిన రోజును పురస్కరించుకొని ఆర్థిక సాయంగా రూ.10 వేల విలువగల చెక్కును అందించారు.

త్రిబుల్ ఆర్ రెండోవిడుత అవార్డు విచారణ

● భూయాజమాన్య పత్రాల పరిశీలన

తూప్రాన్, అక్టోబరు 7: హైదరాబాద్ చుట్టూ నిర్మించ తలపెట్టిన రీజినల్ రింగ్ రోడ్డుకు భూసేకరణ చేసేందుకు రెండో విడుత అవార్డు విచారణ సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి మాట్లాడుతూ మండలంలో 143 హెక్టార్లకు గత మే నెలలో అవార్డు విచారణ జరిగిందని, రెండో విడుతగా 36.04 హెక్టార్ల భూసేకరణ చేరసేందుకు ఎన్‌హెచ్‌ఏఐ జూలై 18న గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. 21 రోజుల్లో చట్టబద్ధత గడువులోగా ఏలాంటి అభ్యంతరాలు రానందున సెప్టెంబరు 25న ఈభూములకు డిక్లరేషన్ ప్రకటన జారీ చేసినట్లు తెలిపారు. ఈ భూములకు సంబంధించి రైతుల యాజమాన్య వివరాలను పరిశీలించేందుకు రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో నర్సంపల్లి, వెంకటాయపల్లి, గుండ్రెడ్డిపల్లి, కిష్టాపూర్ గ్రామాల రైతులతో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. రైతుల యాజమాన్య పత్రాలను పరిశీలన చేసినట్లు వివరించారు. రీజనల్ రింగ్ రోడ్డు ఏర్పాటుకు భూసేకరణకు తాము సహకరిస్తామని, మార్కెట్ ధర చెల్లించాలని రైతులు కోరినట్లు ఆర్డీవో పేర్కొన్నారు.

రైతుల అభ్యంతరాలపై మళ్లీ సర్వే

నర్సాపూర్, అక్టోబరు 7: త్రిబుల్ ఆర్ రోడ్డు కోసం భూములు కోల్పోతున్న డివిజన్ పరిధిలోని 17 గ్రామాల రైతులతో అవార్డు విచారణ సోమవారంతో పూర్తయిందని ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారం శివ్వంపేట మండలం రత్నాపూర్, కొంతాన్‌పల్లి గ్రామాల రైతులతో అవార్డు విచారణ చేపట్టారు. ఆర్డీవో మాట్లాడుతూ విచారణలో రైతుల నుంచి వచ్చిన అభ్యంతరాలపై తిరిగి రైతుల సమక్షంలో సర్వే చేయించి పరిష్కరిస్తామని తెలిపారు.

ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిలిమ్ పోటీలకు ఆహ్వానం

మెదక్ అర్బన్ / సిద్దిపేట క్రైం, అక్టోబరు7 : పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా రాష్ట్ర పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిలిమ్ పోటీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సిద్దిపేట సీపీ డాక్టర్ బి.అనురాధ, మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి వేర్వేరుగా సోమవారం తెలిపారు. సైబర్ నేరాలు, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, మూఢనమ్మకాలు, ఇతర సామాజిక రుగ్మతలు, మత్తుపదార్థాల సేవనం.. వాటి వల్ల అనర్థాలు, అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరిత్యాల్లో పోలీసుల సేవ, ఇతర సందర్భాల్లో పోలీసుల కీర్తి ప్రతిష్టలను పెంపొందించే అంశాలపై పోటీలుంటాయని తెలిపారు. గతేడాది అక్టోబరు నుంచి ఈ నెల వరకు తీసిన మూడు ఫొటోలను, అలాగే షార్ట్‌ఫిలిమ్(3 నిమిషాల నిడివి గల)తో పాటు పూర్తి వివరాలను పెన్‌డ్రైవ్‌లో లేదా సీడీలో ఈ నెల 20 లోగా మెదక్, సిద్దిపేట జిల్లా పోలీసు కార్యాలయాల్లో అందజేయాలని పేర్కొన్నారు. ఈ పోటీలకు విద్యార్థులతోపాటు యువత, ఫొటోగ్రాఫర్లు ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. మిగితా వివరాల కోసం మెదక్ జిల్లాకు సంబంధించి 8712659559, సిద్దిపేటకు జిల్లాకు సంబంధించి 9440379237 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పింఛన్లు ఇప్పిస్తామంటూ మోసం

హుస్నాబాద్, అక్టోబరు 7 : పింఛన్లు ఇప్పిస్తామంటూ హుస్నాబాద్ పట్టణంలో సంచరిస్తూ అమాయకుల నుంచి డబ్బులు కాజేస్తున్నది ఓ ముఠా. వివరాల్లోకి వెళ్తే పట్టణంలోని రెడ్డికాలనీలోకి వచ్చిన ఇద్దరు వ్యక్తులు ప్రభుత్వ అధికారులమని, పింఛన్ ఇప్పిస్తామంటూ వృద్ధులు, మహిళలే లక్ష్యంగా మోసానికి పాల్పడుతున్నారని బాధితులు సోమవారం తెలిపారు. ఇంటింటికీ వెళ్లి 'మీకు పింఛను వస్తుందా..' అని అడుగుతారని, రావడం లేదంటే ఇప్పిస్తామని, వస్తుందంటే రూ. 4వేలు వచ్చేలా చేస్తామని నమ్మబలికి ఆధార్ కార్డు జిరాక్స్‌తోపాటు ఒక్కొక్కరి దగ్గర రూ.2 వేల నుంచి 5వేల వరకు డబ్బులు తీసుకుంటున్నారని వెల్లడించారు. రోడ్డుపై వెళ్లే వ్యక్తులను కూడా నమ్మించి ఇలాంటి మోసాలకు పాల్పడుతున్నారని చెప్పారు. ఒక ఇంటి వద్దకు వచ్చి ఈ విధంగానే మోసం చేయబోగా గుర్తించిన సదరు వ్యక్తి వారిని పట్టుకోవడానికి ప్రయత్నించగా పరారయ్యారని తెలిపారు. నిందితులను గుర్తించి చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

బ్రాహ్మణపల్లి రైల్వే గేటు మొరాయింపు

● ప్రయాణికుల అవస్థలు

తూప్రాన్, అక్టోబరు 7: రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద సోమవారం రాత్రి రైల్వే గేటు మొరాయించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తరచూ ఈ సమస్య ఉత్పన్నమవుతుండడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. తూప్రాన్ పట్టణ పరిధిలో తూప్రాన్ - సంగారెడ్డి రహదారిపై బ్రాహ్మణపల్లి వద్ద రైల్వే లేవల్ క్రాసింగ్ గేటు ఏర్పాటు చేశారు. సోమవారం మధ్యాహ్నం సికింద్రాబాద్ నుంచి ముంబాయి వెళ్తున్న దేవగిరి ఎక్స్‌ప్రెస్ రాకతో బ్రాహ్మణపల్లి రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద గేటు వేశారు. ఆ సమయంలో గేటు లేచేంత వరకు వేచి ఉండకుండా టిప్పర్ డ్రైవర్ వెళ్లే ప్రయత్నం చేయగా గేటు తాకి వంగిపోయి మరమ్మతులకు గురైంది. దీంతో గేటు మరమ్మతులు చేయిస్తుండడం.. అది మొరాయించడం పరిపాటిగా మారడంతో ఈ మార్గంలో వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సోమవారం రాత్రి అరగంట పాటు గేటు మొరాయించినట్లు వాహనదారులు వివరించారు.

జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా జగన్మోహన్‌రెడ్డి


జోగిపేట, అక్టోబరు 7: జోగిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్‌గా మండలంలోని నేరడిగుంట గ్రామానికి చెందిని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మక్త జగన్మోహన్‌రెడ్డి నియామితులయ్యారు. ఈ మేరకు సోమవారం సంగారెడ్డిలోని తన నివాసంలో మంత్రి దామోదర రాజనర్సింహ ప్రకటించారు. ఈ పదవి కోసం.... మండలంలోని అల్మాయిపేట మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, డాకూరుకు చెందిన మాజీ సర్పంచ్ జీఆర్ మధుసూదన్‌రెడ్డి, అక్సాన్‌పల్లి సొసైటీ చైర్మన్ జీఆర్ నరేందర్‌రెడ్డి, నేరడిగుంటకు చెందిన మాజీ ఎంపీటీసీ మిద్దెల రాజిరెడ్డి పోటీ పడ్డారు. ఆదివారం సదాశివపేట మండలంలోని ఓ ఫామ్‌హౌజ్‌లో మార్కెట్ కమిటీ పరిధిలోని కాంగ్రెస్ నాయకులతో మంత్రి సమావేశమయ్యారు. సోమవారం ఉదయం ప్రస్తుతం నియామకమైన జగన్మోహన్‌రెడ్డి మినహా, పోటీలో ఉన్న మిగిలిన నలుగురిని తన ఇంట్లోకి పిలిచిన దామోదర.. వారి ఎదుట జగన్మోహన్‌రెడ్డి పేరును ప్రకటించారు.


జగన్మోహన్ రెడ్డి

గంజాయి విక్రేత అరెస్ట్


నిందితుడు బహుబాన్‌బాగ్

రామచంద్రాపురం, అక్టోబరు 7 : గంజాయి విక్రేతను కొల్లూరు పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సీఐ రవీందర్ కథనం ప్రకారం ఒరిస్సా రాష్ట్రానికి చెందిన బహుబాన్ బాగ్ (32) మైహోమ్ నిర్మాణ సంస్థలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. అతనికి గంజాయి తాగడం అలవాటు. ఇటీవల తన రాష్ట్రానికి వెళ్లిన బహుబాన్ గంజాయిని తెచ్చుకున్నాడు. సోమవారం లేబర్ షెడ్ల వద్ద గంజాయి విక్రయిస్తుండగా కొల్లూరు పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


సంగారెడ్డి రూరల్: ఇస్మాయిల్‌ఖాన్‌పేటలో లలితాపరమేశ్వరిదేవిగా..



సదాశివపేట: మహాచండీదేవి అలంకరణలో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు


వట్‌పల్లి: బూత్కూర్‌లో అమ్మవారు మహాచండీ దేవి అలంకరణలో..


నారాయణఖేడ్: మంగల్‌పేటలో శైలపుత్రిగా దుర్గామాత


జహీరాబాద్: భవానీ మందిరంలో లలితా త్రిపుర సుందరిదేవిగా అలంకరణ


రాయికోడ్‌లో లలితాదేవిగా భక్తులకు దర్శనమిస్తున్న ముమ్మాదేవి


ఝరాసంగం: శ్రీకేతకీ సంగమేశ్వరాలయంలో మహాలక్ష్మీ దేవిగా..


చిన్నశంకరంపేట: కొర్విపల్లిలో మహాగౌరీగా దుర్గామాత


నర్సాపూర్ ధర్మశాలలో చండీమాతగా అమ్మవారి దర్శనం


అల్లాదుర్గం: మండపంలో అమ్మవారికి కుంకుమార్చన నిర్వహిస్తున్న భక్తులు

అట్టహాసంగా శరన్నవరాత్రులు

దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో అట్టహాసంగా కొనసాగుతున్నాయి. మండపాల్లో ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహాలను రోజుకో అలంకరణలో పూజలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం లలితాపరమేశ్వరిగా, శైలపుత్రి, భద్రకాళి, మహాచండిదేవి అలంకరణలో అమ్మవారు పూజలందుకున్నారు. పలు ఆలయాలు, దేవీ మండపాల వద్ద అన్నప్రసాద వితరణ కార్యక్రమాలను చేపట్టారు.

- న్యూస్ నెట్‌వర్క్, అక్టోబరు 7

సంగారెడ్డి జిల్లాలో..

సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖాన్‌పేట గ్రామంలోని సప్త ప్రాకారయుత శ్రీ దుర్గా భవాని మహాక్షేత్రంలో దుర్గాభవాని మాత లలితాపరమేశ్వరి దేవిగా భక్తుల పూజలందుకున్నారు. సదాశివపేట పట్టణంలోని గాంధీచౌక్ వద్ద జైభవాని యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన దుర్గామాత మండపంలో మహాచండీదేవి అలంకారంలో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం అసోషియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చింతా సాయినాథ్, మున్సిపల్ చైర్‌పర్సన్ అపర్ణ శివరాజ్‌పాటిల్, వైస్ చైర్మన్ చింతా గోపాల్, మున్సిపల్ కమిషనర్ జె.ఉమా, బీఆర్ఎస్ నేతలు తదితరులు పాల్గొన్నారు. వట్‌పల్లి మండలంలోని బూత్కూర్ గ్రామంలో నెలకొల్పిన అమ్మవారు మహాచండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. గుమ్మడిదల మండల కేంద్రంలో బొంతపల్లి వీరన్న గూడెం వీరభద్రస్వామి ఆలయంలో భద్రకాళీ అమ్మవారు లలితాదేవి అలంకారంతో భక్తులకు దర్శనం ఇచ్చారు. నారాయణఖేడ్ మున్సిపల్ పరిధిలోని మంగల్‌పేట దుర్గామాత అమ్మవారు శైల పుత్రిగా స్వర్ణ కవచాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. అమ్మవారిని పట్టు వస్త్రాలతో అలంకరించి, రవ్వకేసరి ప్రసాదాన్ని సమర్పించారు. మనూరు మండలం బోరంచ నల్ల పోచమ్మ తల్లిని డీఆర్డీవో పీడీ జ్యోతి, అసిస్టెంట్ పీడీ బాలరాజు సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జహీరాబాద్ పట్టణంలోని సిద్దేశ్వరాలయంవద్ద అమ్మవారు చండీశ్వరీదేవిగా, భవానిమందిర్‌లో లలితాత్రిపురసుందరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. రాయికోడ్‌లోని ముమ్మాదేవి ఆలయంలో అమ్మవారు లలితాదేవిగా భక్తుల పూజలందుకున్నారు. ఝరాసంగం మండలం శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయంలో దుర్గాదేవి అమ్మవారు మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా ఆలయంలో యజ్ఞ, హోమ కార్యక్రమాలను చేపట్టారు.


పెద్దశంకరంపేట: అమ్మవారి పూజలో ఖేడ్ ఎమ్మెల్యే

మెదక్ జిల్లాలో...

దేవీనవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా నర్సాపూర్‌లోని ధర్మశాలలో ఏర్పాటు చేసిన అమ్మవారిని సోమవారం చండీమాతగా అలంకరించారు. చిన్నశంకరంపేటలో మహాగౌరిచండీ అలంకరణలో దుర్గామాత భక్తులకు దర్శనం ఇచ్చింది. పెద్దశంకరంపేటలోని గడికోటలో అమ్మవారు అన్న పూర్ణాదేవిగా దర్శన మిచ్చింది. గంగపుత్ర యూత్ ఆధ్వర్యంలో అమ్మవారి మండపం వద్ద అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. అల్లాదుర్గంలోని దుర్గామాతకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కుంకు మార్చన నిర్వహించారు. మనోహరాబాద్ మండల కేంద్రంలో దుర్గా భవాని మాత సమితి నిలయం వద్ద అమ్మవారిని భక్తులు చండీదేవిగా దర్శించుకుని పూజలు నిర్వహించారు. చేగుంట మండలం వడియారం లో హనుమాన్ ఉత్సవ సమితి అధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గామాతను శ్రీ మహచండీదేవిగా అలంకరించి పూజలు చేశారు.

మండలాల్లో 'ప్రజావాణి'

అల్లాదుర్గం, అక్టోబరు 7: మండలంలో ప్రజావాణి కార్యక్రమానికి ఆదరణ కరువైంది. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆయా శాఖల అధికారులు హజరయినప్పటికీ ఒక్క దరఖాస్తు కూడా రాకపోవడం గమనార్హం.

● నర్సాపూర్: మండలంలోని కాగజ్ మద్దూర్ గ్రామ పరిధిలో రియల్ వ్యాపారులు అక్రమంగా లావాణి పట్టాభూమిని పట్టా చేయించుకున్నారంటూ ఆ గ్రామానికి చెందిన రైతు కుసంగి నర్సింహులు సోమవారం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. దీనిపై విచారణ చేసి న్యాయం చేయాలని కోరాడు.

● ఝరాసంగం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి ఎంపీడీవో సుధాకర్, ఏపీఎం బాలక్రిష్ణ మాత్రమే సకాలంలో హాజరయ్యారు. తహసీల్ కార్యాలయం నుంచి డీటీ యాసిన్ 12 గంటలకు వచ్చారు. మిగతా శాఖల అధికారులు మాత్రం హాజరు కాకుండా విధులకు నిర్లక్ష్యం వహించారు.

శాశ్వత పనులకు ప్రాధాన్యమివ్వాలి: ఖేడ్ ఎమ్మెల్యే


క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్షిస్తున్నఎమ్మెల్యే

నారాయణఖేడ్, అక్టోబరు 7: ఉపాధిహామీ పథకంలో భాగంలో ప్రజలకు ఉపయోగపడే శాశ్వత పనులను చేపట్టాలని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం ఖేడ్‌లోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని ఎంపీడీవోలు, ఉపాధిహామీ పథకం ఏపీవోలు, సాంకేతిక సహాయకులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పూడికతీత తప్ప వేరే పనులకు ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. చేసిన పనుల్లో 70 శాతం పనులైనా ప్రజలకు కనిపించాలన్నారు. నీటి కుంటలు, నీటి సంరక్షణ, మొక్కలు, పండ్లతోటల పెంపకం, గ్రామాలకు మట్టిరోడ్లు, కల్వర్టులు, తదితర పనులకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. రోడ్లు, కల్వర్టుల విషయంలో నిధులను కేటాయిస్తానన్నారు. పీడీ జ్యోతి మాట్లాడుతూ సాంకేతిక సహాయకులు క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. కార్యక్రమంలో అదనపు పీడీ రాజు, ఏపీడీ బాలరాజు, ప్లాంటేషన్ జిల్లా మేనేజర్ మణికుమార్, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

ఖేడ్ పరిధిలోని నిజాంపేట మండలం శాఖాపూర్‌లో ఎమ్మెల్యే సంజీవరెడ్డి సోమవారం అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సేవాలాల్ సంఘం రాష్ట్ర నాయకులు రమేష్ చౌహాన్, నాయకులు పండరిరెడ్డి, లింగారెడ్డి, శివ రాథోడ్, రాధాకిషన్, రఘుపతిరెడ్డి, తదితరులు ఉన్నారు.

పండుగ పూట పస్తులుంచుతారా?


కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో జీపీ కార్మికుల ధర్నా

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 7: గ్రామ పంచాయతీ కార్మికులకు జీతాలిస్తారా.. లేక పండుగ పూట పస్తులుంచుతారా అని సీఐటీయూ జిల్లా నాయకుడు బాబురావు అధికారులను ప్రశ్నించారు. సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ అధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గత మూడు నెలలుగా గ్రామ పంచాయతీ కార్మికులకు జీతాలివ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు కార్మికులకు సకాలంలో వేతనాలు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. వెంటనే కార్మికులకు బకాయి వేతనాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సత్తయ్య, దశరథ్, నాయకులు సంజీవులు, నగేష్, విజేందర్, రవి, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

నారాయణఖేడ్, అక్టోబరు 7: జిల్లాలోనే మారుమూల ప్రాంతమైన ఖేడ్ ప్రాంత అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయించాలని ఖేడ్‌కు చెందిన నీలేష్ మాతాజీ కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండిసంజయ్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన కరీంనగర్‌కు వెళ్లి బండిసంజయ్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. అభివృద్ధి పనులతో పాటు జవహర్ నవోదయ పాఠశాలను, నిరుద్యోగులకు ఉపాధి కోసం పరిశ్రమలను ఏర్పాటు చేయించాలని కోరారు. అందుకు బండిసంజయ్ సానుకూలంగా స్పందించారని నీలేష్ మాతాజీ తెలిపారు.


'బండి'కి వినతిపత్రం ఇస్తున్న నీలేష్ మాతాజీ

ఇద్దరికి మెడికల్ సీటు



సిర్మ అఖిల, గూలే ప్రవీణ్

కంగ్టి, అక్టోబరు 7: కంగ్టికి చెందిన సిర్మ అఖిలతో పాటు తుర్క వడగాంకు చెందిన గూలే ప్రవీణ్ నీట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించి, ప్రభుత్వ మెడికల్ కాలేజీలలో సీట్లు పొందారు. కంగ్టిలో రైతు కుటుంబానికి చెందిన సిర్మ రాంరెడ్డి, సంగీతల కూతురు అఖిల మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు సాధించగా, తుర్కవడగాంకు చెందిన రైతు కుటుంబానికి చెందిన గూలే రాజప్ప కుమారుడు ప్రవీణ్, మహబూబాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు సాధించాడు. మండలం నుంచి ఇద్దరు ప్రభుత్వ వైద్య కళాశాలలో సీట్లు సాధించడం పట్ల మండల ప్రజలు వారిని అభినందించారు.

విద్యార్థినికి అదనపు కలెక్టర్ అభినందన


మెడికల్ సీటు సాధించిన రాజకుమారిని అభినందిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 7: బుధేరా గ్రామానికి చెందిన ఎర్రోళ్ల రాజకుమారి నవోదయలో విద్యాభ్యాసం చేసి నీట్ ప్రవేశ పరీక్షలో 720 మార్కులకుగాను 634 మార్కులు సాధించింది. ఎయిమ్స్ మదురై చెన్నైలో నీట్ సీటు సాధించిన నవోదయ విద్యార్థినిని సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఈవో వెంకటేశ్వర్లు అభినందించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమాజంలో ఉన్నతమైన వృత్తి డాక్టర్ అని, మంచి డాక్టర్‌గా పేదలకు సేవలందించి పుట్టిన ఊరికి జన్మనిచ్చిన తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో తండ్రి రాజు, తల్లి భాగ్యలక్ష్మి, తాతయ్య రాములు, ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గయ్య, చంద్రశేఖర్, సంఘం సలహాదారుడు మారుతి, కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా బతుకమ్మ పాటల హోరు


జోగిపేటలో సద్దుల బతుకమ్మ ఆడుతున్న మహిళలు


బొల్లారం మున్సిపల్ కార్యాలయంలో బతుకమ్మ వేడుకల్లో చైర్‌పర్సన్ రోజారాణి, కమిషనర్, కౌన్సిలర్లు


సంగారెడ్డి ఆర్టీసీ డిపోలో బతుకమ్మ ఆడుతున్న మహిళా ఉద్యోగులు

సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని వాడలన్నీ బతుకమ్మ పాటలతో హోరెత్తిపోతున్నాయి. తీరొక్కపూలతో బతుకమ్మలను అందంగా పేర్చడంలో మహిళలు, చిన్నారులు పోటీ పడుతున్నారు. ఆనవాయితీగా సద్దులబతుకమ్మను సప్తమి తిథినాడు జరుపుకుంటారు. కాగా పలు చోట్ల పంచమి తిథి అయిన సోమవారంనాడే సద్దుల బతుకమ్మను ఘనంగా జరుపుకున్నారు. పలు ప్రభుత్వ కార్యాలయాల్లోనూ మహిళా ఉద్యోగులు, సిబ్బంది బతుకమ్మ పండుగను జరుపుకున్నారు.

● జోగిపేట, అక్టోబరు 7: తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగను పట్టణంలో మహిళలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. వందలాదిమంది మహిళలు బతుకమ్మ పండుగలో పాల్గొన్నారు. తెలంగాణ అంతటా.... సప్తమి తిథి రోజున సద్దుల బతుకమ్మ పండగను జరుపుకుంటే, జోగిపేట పట్టణంలో మాత్రం పంచమి నాడు ఈ పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. చిన్నా పెద్దా తేడా లేకుండా మహిళలంతా ఉదయాన్నే లేచి తలంటు పోసుకుని తంగేడు, గునుగు, బంతి తదితర రకరకాలైన పూలతో బతుకమ్మలను పేర్చడంలో పోటీపడ్డారు. వాటితో పాటు గౌరమ్మను కూడా పేర్చి భక్తి శ్రద్ధలతో పూజలు చేసి వివిధ రకాల పిండివంటలు, సద్దులను నైవేద్యంగా సమర్పించారు. అనంతరం బతుకమ్మలరె స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో ఉంచి చుట్టూ లయబద్ధంగా అడుగులు వేస్తూ, బతుకమ్మ పాటలతో సందడి చేశారు. అనంతరం వాటిని స్థానిక రంగనాయక సాగర్ (అందోలు చెరువు)లోకి తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు. కాగా బతుకమ్మ పండగను పురస్కరించుకుని జోగిపేటలో పోలీసులు భారీ బందోబస్తును నిర్వహించారు. స్థానిక సీఐ అనిల్ కుమార్, ఎస్ఐ పాండు ఆధ్వర్యంలో పోలీసు బలగాలు పట్టణంలోని అన్ని ప్రధాన కూడళ్లలో బందోబస్తును నిర్వహించారు.

● సంగారెడ్డి అర్బన్: సంగారెడ్డి డిపోకు చెందిన మహిళా ఉద్యోగులు, మహిళా కండక్టర్లు బతుకమ్మను పేర్చి పాటలు పాడుతూ బతుకమ్మ ఆడారు. అంతకుముందు డిపో మేనేజర్ ఉపేందర్ బతుకమ్మకు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డీఎం, ఆర్ఎం, సిబ్బంది పాల్గొన్నారు.

● హత్నూర: హత్నూర ఐకేపీ కార్యాలయం వద్ద మండల సమైక్య ఆధ్వర్యంలో సోమవారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. తహసీల్దార్ ఫర్హీన్ షేక్ మండలంలోని అన్ని మహిళా గ్రామైక్య సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు బతుకమ్మల సంబరాల్లో పాల్గొన్నారు.

● జిన్నారం: బొల్లారం మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో చైర్ పర్సన్ రోజారాణి, కమిషనర్ మంగతాయారు, మహిళా కౌన్సిలర్లు, వైద్య, అంగన్‌వాడీ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

● చిలప్‌చెడ్: మండలంలోని జగ్గంపేట, చండూరు గ్రామాల్లో సద్దుల బతుకమ్మ ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో బతుకమ్మలను ఉంచి ఆటపాటలో సంబరాలు జరుపుకున్నారు. అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేసి సామూహిక భోజనాలు చేశారు.

● శివ్వంపేట: మండల పరిధిలోని దొంతి గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రం వద్ద బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ సిబ్బంది బతుకమ్మను అందంగా పేర్చి ఆడి పాడారు.

● టేక్మాల్: మండలంలోని పాల్వంచ, బర్దిపూర్ గ్రామాల్లో సోమవారం సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లోని పొలిమేరలో ఉన్న చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

● పెద్దశంకరంపేట: పెద్దశంకరంపేటలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, మహిళలు బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గ్రేస్‌బాయ్, సిబ్బంది భవానీ, విజయనిర్మల, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.


చిలప్‌చెడ్: జగ్గంపేటలో నిమజ్జనానికి తరలివెళ్తున్న మహిళలు


శివ్వంపేట: దొంతిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సంబురాలు


టేక్మాల్: పాల్వంచలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

నలుగురిపై డ్రంకెన్‌డ్రైవ్ కేసు

కల్హేర్, అక్టోబరు 7: డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీల్లో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సిర్గాపూర్ ఎస్ఐ వెంకటరెడ్డి తెలిపారు. సోమవారం సిర్గాపూర్ బస్టాండ్ కూడలి శివాజీచౌక్‌లో డ్రంకెన్‌డ్రైవ్ టెస్టులు నిర్వహించగా మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన నలుగురిపై కేసులు నమోదు చేశామన్నారు.

సూపర్ మార్కెట్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారి తనిఖీలు

చేగుంట ,అక్టోబరు 7: మండల కేంద్రంలో ఎస్ఎన్‌మార్టు(సూపర్ మార్కెట్)ను మెదక్ ఫుడ్‌సేఫ్టీ ఇన్‌చార్జి అథారిటీ అధికారి శ్రీషిక సోమవారం తనిఖీలు నిర్వహించారు. షాపులోని నాల్గు అల్లం వెల్లులి పేస్టు డబ్బాలను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల సూపర్ మార్కెట్‌లో కాలం చెల్లిన వస్తువులు అమ్ముతున్నారనే ఫిర్యాదులు రావడంతో తనిఖీలు చేపట్టినట్లు తెలిసింది. అధికారి వెంట తూప్రాన్ డివిజన్ వైద్యాధికారి జ్ఞానేశ్వర్ ఉన్నారు.

సీడీసీ చైర్మన్‌ను సన్మానించిన కొండాపూర్ నాయకులు



సీడీసీ చైర్మన్ రాంరెడ్డిని సన్మానిస్తున్న గొల్లపల్లి సొసైటీ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, కొండాపూర్ మాజీ ఎంపీటీసీ నర్సింహారెడ్డి తదితరులు

కొండాపూర్, అక్టోబరు 7: నూతన సీడీసీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన రాంరెడ్డిని కొండాపూర్ కాంగ్రెస్ నాయకులు సోమవారం ఘనంగా సన్మానించి సత్కరించారు. కార్యక్రమంలో ఆత్మకమిటీ చైర్మన్ ప్రభు సదాశివపేట మార్కెట్‌కమిటీ చైర్మన్ కుమార్, గొల్లపల్లి పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, కొండాపూర్ మాజీ ఎంపీటీసీ నర్సిహారెడ్డి, నాయకులు భారీగా పాల్గొన్నారు.

సమష్టి కృషితో వార్డు అభివృద్ధి

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 7: అందరి ఆదరాభిమానాలు, సమష్టి కృషితోనే వార్డుని అన్ని విధాల అభివృద్ధి చేసుకున్నామని సంగారెడ్డి మున్సిపల్ పరిధిలోని 23వ వార్డు కౌన్సిలర్ కూన వనిత సంతోష్‌కుమార్ పేర్కొన్నారు. వార్డులో వంద శాతం పనులు చేసినందుకు గాను సోమవారం కౌన్సిలర్ కూన వనిత సంతోష్‌కుమార్ దంపతులకు కాలనీవాసులు అభినందనసభ ఏర్పాటు చేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి ఇక ముందు కూడా మీకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తానన్నారు. మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఏకగ్రీవంగా ఎన్నుకుంటామని శివాజీనగర్ కాలనీవాసులు తీర్మానం చేశారు. కార్యక్రమంలో వెన్న చక్రేశ్వర్, ప్రభులింగం, రఘుకులకర్ణి, శ్రీనివాస్, చిందం దుర్గయ్య, ప్రసాద్, రాజు, రేవంత్, రాహుల్, యశోద, పుష్పమ్మ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నశంకరంపేట తపస్ అధ్యక్షుడిగా శ్రీహరి


శ్రీహరి, అధ్యక్షుడు


మహేష్, కార్యదర్శి

చిన్నశంకరంపేట, అక్టోబరు 7: మండల (తపస్) నూతన కార్యవర్గాన్ని సోమవారం నియమించారు. తపస్ జిల్లా అధ్యక్షుడు జిడ్డి ఎల్లం, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ ఆధ్వర్యంలో కమిటీని ఎన్నుకున్నారు. తపస్ మండలాధ్యక్షుడిగా బక్కన్నగారి శ్రీహరి, ప్రధాన కార్యదర్శిగా బక్కోళ్ల మహేష్, కోశాధికారిగా నరేందర్, ఉపాధ్యక్షుడిగా భాస్కర్‌రావు, కార్యవర్గ సభ్యులుగా లక్ష్మి, కిషన్, వెంకటేష్, నవిత, మంగరాణి, ప్రమోద్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

కాజీపల్లిలో అక్రమ కట్టడాల కూల్చివేత

జిన్నారం, అక్టోబరు 7: ప్రభుత్వ భూమిలో నిర్మించిన అక్రమ కట్టడాలను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. సోమవారం కాజీపల్లి 18 సర్వే నెంబరులోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన నాల్గు నిర్మాణాలను ఆర్ఐ జయప్రకాష్‌నారాయణ, రెవెన్యూ సిబ్బంది కూల్చివేశారు. ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాలు చేపడితే కేసులు నమోదు చేస్తామని ఆర్ఐ హెచ్చరించారు.

తాత్కాలిక ప్రాతిపదికన బోధనకు దరఖాస్తుల ఆహ్వానం

జహీరాబాద్, అక్టోబరు 7: సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 2024-25 సంవత్సరానికి గాను గిరిజన గురుకుల పాఠశాలలు, కళాశాల్లో అధ్యాపకులు, ఉపాధ్యాయులుగా బోధించేందుకు తాత్కాలిక ప్రాతిపదిన దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని మొగుడంపల్లి గిరిజన గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ పి. హిమబిందు సోమవారం తెలిపారు. నారాయణఖేడ్, కంగ్టి, కసర్‌గుత్తి, సిర్గాపూర్ గిరిజన విద్యాలయాల్లో 28 ఉపాధ్యాయ, అధ్యాపకుల పోస్టులు ఖాళీగ ఉన్నాయని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు జిన్నారంలోని గిరిజనగురుకుల విద్యాలయంలో దరఖాస్తులను అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు 8333925392 నెంబరుకు సంప్రదించాలని ఆమె కోరారు.

రాష్ట్రంలో బీజేపీ బలపడుతోంది


రామాయంపేటలో సభ్యత్వ సేకరణ తీరును పరిశీలిస్తున్న ఆనంద్ గౌడ్

రామాయంపేట, అక్టోబరు 7: తెలంగాణలో బీజేపీ బలపడుతోందని ఆ పార్టీ అనుబంధ సంస్థ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ పేర్కొన్నారు. ఇప్పటికే దేశమంతటా ఆన్‌లైన్ సభ్యత్వాలు సైతం ఎంతో చురుకుగా సాగుతున్నాయన్నారు. రామాయంపేట పట్టణంలో ఏర్పాటు చేసిన సభ్యత్వ సేకరణ కార్యక్రమానికి విచ్చేసిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. మోదీ నేతృత్వంలో దేశ పురోభివృద్ధే లక్ష్యంగా ప్రజలు తమ పార్టీ పట్ల ఆకర్షితులవుతున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు శంకర్‌గౌడ్, భాను, దయానందరెడ్డి, చింతల శేఖర్, శ్రీనివాస గౌడ్, అవినాష్ పాల్గొన్నారు.

యువత దేశరక్షణకు పాటుపడాలి


సమావేశంలో మాట్లాడుతున్న సహకార్యవాహ

చేగుంట, అక్టోబరు 7: విజయదశమి ఉత్సవాల్లో బాగంగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ చేగుంట అధ్వర్యంలో సోమవారం పట్టణంలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పథ సంచాలన్ కార్యక్రమం చేపట్టారు. అనంతరం మండలపరిషత్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో మెదక్ విభాగ్ సహకార్యవాహ బోల్లి నర్సింహులు ముఖ్యఅతిథి రఘురాంశర్మ మాట్లాడారు యువత దేశం పై గౌరవం పెంచుకొని దేశ రక్షణకు పాటుపడాలని వారు సూచించారు. యువత తరచూ ఆర్ఎస్ఎస్ కార్యక్రమాల్లో పాల్గొంటే చెడు అలవాట్లకు దూరమవుతారన్నారు. కార్యక్రమంలో మాననీయ ఖండ సంఘ్ చాలక్ చుంచు యాదగిరి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బందులు రాకుండా ఉండేందుకే సిబ్బందికి శిక్షణ

నర్సాపూర్,అక్టోబరు 7: గ్రామాల్లో మంచినీటి సరఫరాలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా తక్షణమే మరమ్మతులు చేసి వాటిని పరిష్కరించాలనే ఉద్దేశంతో పంచాయతీలలో పనిచేసే మంచినీటి సరఫరా సహాయకులకు శిక్షణ ఇస్తున్నట్లు మిషన్‌భగీరథ ఈఈ సంపత్‌కుమార్ తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో మిషన్‌భగీరథ ఆధ్వర్యంలో మండలంలోని ఆయా పంచాయతీలలో పనిచేసే మంచినీటి సరఫరా సహాయకులకు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో డీఈఈలు ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్, ఎంపీడీవో మాధవిలత, ఎంపీవో శ్రీనివాస్, ఏఈ లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

వెల్దుర్తి/నర్సాపూర్, అక్టోబరు 7: మండల పరిధిలోని హస్తాల్‌పూర్ గ్రామానికి చెందిన గంగమణి, కుకునూర్ గ్రామానికి నర్సింలుకు సీఎంఆర్ఎఫ్ కింద ఆర్థికసాయం మంజూరైంది. ఈ మేరకు సోమవారం వెల్దుర్తిలో రూ.48 వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే సునీతారెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీనాయకులు పాల్గొన్నారు. అదే విధంగా అనారోగ్యంతో చికిత్స పొందుతున్న హత్నూర మండలం నాగరాణికి రూ.2.25లక్షలు, నర్సాపూర్ మండలం తిర్మలాపూర్ గ్రామానికి చెందిన సువర్ణకు చికిత్స నిమిత్తం రూ.1.25లక్షల ఎల్‌వోసీని లబ్ధిదారుల కుటుంబీకులకు కాంగ్రెస్ నాయకుడు ఆవుల రాజిరెడ్డి క్యాంపు కార్యాలయంలో అందచేశారు.